# ఆటో డ్రైవర్ల భిక్షాటన

- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆందోళన
- మహిళలకు బస్సు ఫ్రీతో రోడ్డునపడ్డామంటూ ఆవేదన
- ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం



కరీంనగర్: బస్టాండ్ ఎదుట భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు

కరీంనగర్ తెలంగాణచౌక్, జనవరి 3: మహిళలకు బస్సు ఫ్రీ జర్నీ చేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. తమను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆటో కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, నగర అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వందలాది మంది ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు. జిల్లా కేంద్రంలోని బస్టాండు ఎదుట, తెలంగాణ చౌక్‌లో బాటసారులు, ప్రయాణికుల వద్ద భిక్షాటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిపించి తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ చౌక్ వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి దండాలు పెట్టి వేడుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ప్రయాణ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డుపడ్డాయన్నారు. కరీంనగర్ జిల్లాలో 17 వేల మంది జీవనోపాధి కోల్పోయారని, పథకం ప్రారంభించిన నాటి నుంచి రోజుకు కనీసం ₹200 కూడా రావడంలేదన్నారు. పిల్లలు ఫీజలు, ఇంటి కిరాయి, ఆటో ఫైనాన్స్ కట్టలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకానికి తాము వ్యతిరేకం కాదని, తమను వెంటనే ఆదుకోవాలని, ప్రతి నెలా ₹15వేల జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఈ నెల 7న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్‌లో భారీ ఎత్తున ఆటో డ్రైవర్లతో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సంపత్, మల్లేశం పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

# ఆదర్శమూర్తి.. సావిత్రీబాయి

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, జనవరి 3: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే ఆదర్శమూర్తి అని, నిమ్నజాతి వర్గాలకు చదువు నేర్పించడం కోసం ఎనలేని కృషి చేశారని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ కొనియాడారు. ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె సేవలను నేటి తరానికి వివరించాలని పిలుపునిచ్చారు. సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకొని ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని అమర్ చంద్ కల్యాణ మండపంలో కాళేశ్వరం జోన్‌లో ఉత్తమ సేవలందించిన 300 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులకు బుధవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పుట్ట మధు ముఖ్య అతిథిగా హాజరై, మహిళా ఉద్యోగులను సన్మానించారు. ప్రశంస పత్రాలు అందజేశారు. ఒకే వేదికపై వివిధ శాఖల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులను సత్కరించడంపై నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతనియల్, ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా అధ్యక్షుడు లింగమల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఈర్ల శోభరాణి, నాయకులు పోగుల వెంటేశం, క్యాదాసి రాజేశం, బొంకూరి ప్రవీణ్, దుబాసి బొందయ్య, శివధర్, నర్సయ్య, లక్ష్మణ్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రామగుండం సీపీగా శంకర్ చౌహాన్



ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 3: రామగుండం నూతన పోలీసు కమిషనర్‌గా ఎల్ శంకర్ చౌహాన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 23 మంది ఐపీఎస్‌లను బదిలీ చేయగా, ఇక్కడ సీపీగా ఉన్న రెమా రాజేశ్వరిని హైదరాబాద్‌లోని మహిళా రక్షణ విభాగం డీఐజీగా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆమె స్థానంలో జోగులాంబ గద్వాల జోన్‌కు డీఐజీగా ఉన్న శంకర్ చౌహాన్ ఇక్కడికి వస్తున్నారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 అధికారిగా పనిచేశారు. 2009లో ఐపీఎస్‌గా ఉద్యోగోన్నతి పొందారు. గతేడాది ఫిబ్రవరిలో డీఐజీగా ప్రమోషన్ పొంది, జోగులాంబ గద్వాల జోన్‌కు నియమితులయ్యారు. అలాగే గోదావరిఖని సబ్ డివిజనల్ డీఎస్పీగా 2001 నవంబర్4 నుంచి 2004 జూన్2 వరకు పనిచేశారు.

# 25 రోజులు.. 9.06 లక్షల మెట్రిక్ టన్నులు

- ఈ నెల 31వరకు గడువు పొడిగించిన ప్రభుత్వం
- ఆలోగా ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వడంపై అనుమానాలు
- తనిఖీల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు
- మిల్లుల్లో కోట్ల విలువైన ధాన్యం మాయం
- చర్యలకు సిద్ధమవుతున్న అధికారయంత్రాగం

## ఇది సీఎంఆర్ పూర్తికి లక్ష్యం



ఉమ్మడి జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కేటాయించిన ధాన్యం మేరకు తిరిగి అప్పగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2022-23కు సంబంధించిన సీఎంఆర్‌ను గత డిసెంబర్ 31లోపే అప్పగించాల్సి ఉన్నా.. యాభై శాతం కూడా లక్ష్యం చేరుకోలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నెల 31వరకు గడువు పొడిగించినా.. ఆలోగా లక్ష్యం పూర్తయ్యే దాఖలాలు కనిపించడం లేదు. సీఎంఆర్ కింద ఇంకా 9.06 లక్షల పై చిలుకు మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉన్నది. ఇంత పెద్ద మొత్తంలో బియ్యాన్ని అప్పగించడం ఏ పరిస్థితుల్లో సాధ్యం కాదని గత పరిస్థితులు స్పష్టం చేస్తుండగా, ఇప్పటికే కోట్ల విలువైన ధాన్యాన్ని పలువురు మిల్లర్లు అమ్ముకున్నట్లు ఇటీవలి తనిఖీల్లో బహిర్గతమైంది. ఈ పరిస్థితుల్లో మరోసారి గడువు పొడిగించకుండా.. లక్ష్యాన్ని పూర్తి చేయని మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సంబంధిత అధికారులకు అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం.

కరీంనగర్, జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ధాన్యం పండించిన రైతుకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొంటున్నది. సదరు ధాన్యాన్ని పైసా పెట్టుబడి లేకుండా కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పేరిట మిల్లర్లకు అందిస్తున్నది. క్వింటాల్ ధాన్యానికి ఇంచుమించు గా 67 కిలోల బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే 2022-23 వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని మిల్లులకు ప్రభుత్వం సీఎంఆర్ కింద మొత్తం 25,19,652 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించింది. అందుకు గాను 16,96,836 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు అప్పగించాల్సి ఉన్నది. కానీ, రెండు సీజన్లలో కలిపి ఇప్పటివరకు 7,90,498 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. అంటే లక్ష్యంలో కేవలం 46 శాతం మాత్రమే మిల్లర్లు అప్పగించారు. అధికారుల గణాంకాల ప్రకారం చూస్తే.. 9,06,338 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పగించాలి ఉన్నది. నిజానికి సీఎంఆర్ కింద గతంలో మూడు సార్లు గడువు పొడిగించి.. చివరకు గత డిసెంబర్ 31లోగా పూర్తి చేయడానికి అవకాశమిచ్చింది. అయినా మిల్లర్ల నుంచి అంతంత మాత్రమే స్పందన వచ్చినట్టుగా కనిపిస్తున్నది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పలు హెచ్చరికలు చేసినా.. సీఎంఆర్ వేగం పెరిగినట్లుగా పెద్దగా కనిపించడం లేదు. కాగా, మరికొంత సమయం ఇచ్చినా ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 31వరకు గడువు ఇచ్చింది. ఈ లెక్కన ఇంకా 25రోజుల గడువు ఉన్నది. ఈ గడువులోగా మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యం మేరకు బియ్యం ఇస్తారా..? అంటే అసాధ్యమే అని చెప్పాలి. ఆరు నెలల నుంచి ఏడాది పాటు టైం ఇచ్చినా పలువురు మిల్లర్లు వారికి కేటాయించిన ధాన్యం మేరకు బియ్యం ఇవ్వడం లేదు. నిజానికి ఉమ్మడి జిల్లాలో కొంత మంది మిల్లర్లు 2021-22 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ కూడా ఇప్పటికీ పూర్తి చేయలేదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో 2022-23కు సంబంధించి లక్ష్యం పూర్తి చేయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కోట్లు విలువైన ధాన్యం మాయం

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వం మిల్లర్లకు అప్పగిస్తున్నది. కానీ, తిరిగి బియ్యం ఇవ్వడంలో మాయాజాలం కనిపిస్తున్నది. అయితే మిల్లర్లు వివిధ కారణాలు చెప్పడం, తద్వారా ప్రభుత్వాలు సీఎంఆర్ గడువు పొడిగించడం జరుగుతున్నది. దీనిని దృష్టిలో పెట్టుకొని కొంతమంది అక్రమాలకు తెరలేపినట్లుగా ఇటీవల మిల్లులపై జరిగిన దాడులే బహిర్గతం చేస్తున్నాయి. జమ్మికుంట, జగిత్యాల, హుజూరాబాద్, పెద్దపల్లి తదితర ప్రాంతాల్లో విజిల్స్‌తోపాటు పౌరసరఫరాల అధికారుల తనిఖీల్లో విస్తుపోయేలా అక్రమాలు వెలుగుచూశాయి. కోట్ల విలువ చేసే ధాన్యం సదరు మిల్లుల్లో కనిపించకుండా పోయింది. ఆరా తీస్తే.. సదరు ధాన్యాన్ని కొంత మంది ఇతర ప్రాంతాల్లో నేరుగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటే.. మరికొంత మంది బియ్యం చేసి విక్రయించుకున్నట్టుగా తనిఖీల్లో బయటపడింది. కాగా, కొంత మంది మాత్రం నిజాయితీగా వారికి కేటాయించిన ధాన్యాన్ని సంబంధించిన బియ్యం ఇస్తుంటే.. మరికొంత మంది మాత్రం ధాన్యం విక్రయించి సొమ్ము చేసుకున్నారనే విమర్శలు ప్రస్తుతం మిల్లర్లలోనే వినిపిస్తున్నాయి.

### చర్యలకు సిద్ధం

సీఎంఆర్‌కు సంబంధించి ఈ నెల 31 వరకు గడువిచ్చిన సర్కారు, ఆ లోగా లక్ష్యం పూర్తి చేయని మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు అధికారవర్గాల ద్వారా తెలుస్తున్నది. ఇప్పటికే ఈ విషయంలో సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చాయని ఓ అధికారి తెలిపారు. ముందుగా సంబంధిత మిల్లర్లతో మాట్లాడి లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటారు. గడువులోగా ఇవ్వకుంటే వారి పూర్తి వివరాలు సేకరించి.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ విషయంలో ఒక్క పౌరసఫరాల శాఖకు మాత్రమే బాధ్యతలు అప్పగించకుండా.. నేరుగా కలెక్టర్లను రంగంలోకి దింపేందుకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లుగా అధికారవర్గాల ద్వారా సమాచారం అందుతున్నది. ఈ నేపథ్యంలో ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లు మాత్రం.. ప్రభుత్వంపై ఏదో ఒక మార్గంలో ఒత్తిడి తెచ్చి ఈ గడువును మార్చి 31వరకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టినట్టుగా తెలుస్తున్నది. ఈ పరిస్థితుల్లో మిల్లర్ల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గుతుందా..? లేక నిబంధనల ప్రకారం రావాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించని వారిపై చట్టపరమైనా చర్యలు తీసుకుటుందా..? చూడాల్సిన అవసరమున్నది.



జమ్మికుంట: మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

**2022-23లో సీఎంఆర్ కింద ఆయా జిల్లాలకు వానాకాలం, యాసంగి సీజన్లలో కేటాయించిన మొత్తం ధాన్యం, ఇవ్వాల్సిన మొత్తం బియ్యం, ఇప్పటివరకు ఇచ్చిన బియ్యం, ఇంకా పెడింగ్‌లో ఉన్న బియ్యం వివరాలు ( మెట్రిక్ టన్నుల్లో)**

| | కరీంనగర్ | | జగిత్యాల | | రాజన్న సిరిసిల్ల | | పెద్దపల్లి | |
|---|---|---|---|---|---|---|---|---|
| | వానకాలం | యాసంగి | వానకాలం | యాసంగి | వానకాలం | యాసంగి | వానకాలం | యాసంగి |
| మిల్లులకు ఇచ్చిన మొత్తంధాన్యం | 2,96,900 | 3,74,825 | 3,38,187 | 4,21,197 | 2,18,421 | 2,18,414 | 2,99,757 | 3,51,951 |
| మిల్లర్లు ఇవ్వాల్సిన మొత్తం బియ్యం | 1,99,901 | 2,53,634 | 2,27,293 | 2,80,944 | 1,47,288 | 1,47,614 | 2,00,837 | 2,39,327 |
| మిల్లర్లు ఇప్పటివరకు ఇచ్చిన బియ్యం | 1,63,339 | 54,955 | 1,71,529 | 52,394 | 1,08,337 | 43,703 | 1,38,309 | 59,493 |
| ఇంకా ఇవ్వాల్సిన బియ్యం | 36,562 | 1,98,679 | 56,394 | 2,27,967 | 40,026 | 1,04,348 | 62,528 | 1,79,834 |

# అంగన్‌వాడీల్లో సరుకుల కొరత

- వారం రోజులుగా అందని పాలు
- చేబదులుతో సరిపుచ్చుతున్న టీచర్లు
- కొత్త ఒప్పందం పేరిట పంపిణీలో నిర్లక్ష్యం
- మండిపడుతున్న బాలింతలు, గర్భిణులు

అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల్లో చిక్కుకుంటున్నాయి. పిల్లల్లో ఎదుగుదల లోపాలు నివారిస్తూ, మాతా శిశు మరణాల నిర్మూలనే లక్ష్యంగా పౌష్టికాహారం అందించిన ఈ సెంటర్లు నెలరోజులుగా సరుకుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధానంగా గర్భిణులు, బాలింతలకు నిత్యం అందించే పాల సరఫరా నిలిచిపోయింది. ఇక పప్పులు, ఇతర సరుకులు నిండుకోవడంతో పక్క కేంద్రాల నుంచి చేబదులుగా తెచ్చి వంట చేయాల్సిన దుస్థితి దాపురించింది. కొత్త ఒప్పందం పేరిట నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తుండగా, అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.



కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 3: అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు నిండుకుంటున్నాయి. ఆరోగ్యలక్ష్మిలో భాగంగా ప్రతి నెలా సరఫరా చేయాల్సిన సరుకుల్లో ఏదో ఒకటి కోత పెడుతుండగా, గుత్తేదారులు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 25 నుంచి జిల్లాకు పాల సరఫరా నిలిచిపోగా, గర్భిణులు, బాలింతలకు అందించలేకపోతున్నారు. పౌష్టికాహారంలో భాగంగా నిత్యం ఉపయోగించాల్సిన పప్పులు కూడా నిండుకోవడంతో టీచర్లు పక్క కేంద్రాల నుంచి చేబదులుగా తెచ్చి వంట వండుతున్నారు. అక్కడా కూడా సరుకులు అంతంత మాత్రంగానే ఉండడంతో రెండ్రోజుల నుంచి చేబదులు కూడా పుట్టడం లేదని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంపిణీ చేసిన ఆహార నిల్వలు దాదాపు అన్ని సెంటర్లలో నిండుకున్నాయని, పలు కేంద్రాల్లో ఉన్న నిల్వలు మరో మూడు, నాలుగు రోజులకు మాత్రమే సరిపోతాయని చెబుతున్నారు. గర్భిణులు, బాలింతలకు నిత్యం 200 మిల్లీ లీటర్ల పాలు అందించాల్సి ఉండగా, దానికి ఎగనామం పెట్టారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, అత్యధిక కేంద్రాల్లో వారం, పది రోజుల నుంచి పాలు పంపిణీ చేయడం లేదని చెబుతున్నారు.

### పట్టింపు అంతంతే

ఫుడ్ సెక్యూరిటీ యాక్టును అనుసరించి 45 రోజులకు సరిపడా ఆహార పదార్థాలను ముందుగానే కేంద్రాల్లో నిల్వ చేయాల్సి ఉంటుంది. అయితే, సరుకుల నిల్వలపై సంబంధిత అధికారులకు సమాచారమిచ్చినా, పెద్దగా స్పందించడం లేదని తెలుస్తున్నది. కాగా, సరుకుల సరఫరాకు సంబంధించి ఒప్పంద గడువు ముగియడంతోనే కొరత వేధిస్తున్నట్టు తెలుస్తున్నది. గతంలో గడువు ముగిస్తే, పునః ఒప్పందం జరిగే వరకు అప్పటిదాకా సరఫరా చేసిన సంస్థ నుంచే తాత్కాలికంగా పాల ప్యాకెట్లు కొనుగోలు చేసేది. అయితే ఈసారి మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. పాల పంపిణీ నిలిచిపోయినా స్పందన కనిపించడం లేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ప్రస్తుత పాల సరఫరా ఏజన్సీని ఉంచుతుందా..? కొత్త ఏజెన్సీతో ఒప్పందం చేసుకుంటుందా..? అనేది తెలియాల్సి ఉన్న ది. ఒకవేళ కొత్త సంస్థతో ఒప్పందం చేసుకుంటే అది పూర్తయి అనుమతులు రాగానే పాల సరఫరా మొదలవుతుంది. ఇదే విషయాన్ని స్థానిక అధికారులు చెబుతున్నారు.

### ఉన్నతాధికారులకు నివేదించాం

అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా నిలిచిపోవడంపై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రతి రెండు నెలలకోసారి ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. జనవరి, ఫిబ్రవరికి సంబంధించి ఇప్పటికే పంపాం. కొన్ని జిల్లాలకు బుధవారం నుంచి పంపిణీ ప్రారంభించే అవకాశం కనిపిస్తున్నది. కరీంనగర్ జిల్లాకు కూడా త్వరలోనే పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు.

- ఎం సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి (కరీంనగర్)



కరీంనగర్: మాట్లాడుతున్న నగర మేయర్ సునీల్‌రావు

# ‘బండి’ చేసిందేమీలేదు

- లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు మూడో స్థానమే
- బీజేపీకి ఓటేస్తే మోరిలో వేసినట్లే
- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 3: ‘ప్రజలకు అందుబాటులో లేని, అభివృద్ధిని పట్టించుకోని బండి సంజయ్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానమే దక్కుతుంది’ అంటూ నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు జోస్యం చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని అన్నారు. బీజేపీకి ఓటేస్తే మోరిలో వేసినట్టేనని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేండ్లు ఎంపీగా పని చేసిన సంజయ్ కనీసం నియోజకవర్గంలోని మండలాలకు వెళ్లలేదన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం అభ్యర్థినని చెప్పుకున్న ఆయనను ప్రజలు తిరస్కరించారని గుర్తుచేశారు. ఇది తెలుసుకోకుండా ప్రగల్భాలు పలుకుతున్నాడని మండిపడ్డారు. దేశంలో 350 సీట్లతో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు పగటి కలలు కంటున్నారన్నారు. బండి సంజయ్‌కి లోక్‌సభ టికెట్ ఇవ్వద్దంటూ ఆ పార్టీ నాయకులే చెబుతున్నారని గుర్తుచేశారు. ఇదంతా సంజయ్ స్వయంకృతాపరాధమన్నారు.గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయాడనే సానుభూతితో ప్రజలు ఎంపీగా బండి సంజయ్‌ని గెలిపించారని, కానీ అన్నిసార్లు సానుభూతి పని చేయదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. రైతుబంధు రాక, కరెంట్ అందడంలేదనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బండి సంజయ్ విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేసినా ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. ఇదే తీర్పు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ పునరావృతమవుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, వాల రమణరావు, కంసాల శ్రీనివాస్, నేతికుంట యాదయ్య, గందె మాధవి, నాయకులు పవన్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల అత్యుత్సాహం

వేదికపై కూర్చోనివ్వాలని అధికారులతో వాగ్వాదం

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 3: ఆరు గ్యారంటీల అమలు కోసం అంతటా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వ పరంగా సాగుతున్న ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వేదికలపై తమను కూర్చోనివ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదే విషయమై బుధవారం కరీంనగర్‌లోని 5వ డివిజన్‌లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అధికారిక కార్యక్రమంలో ఇతరులకు అవకాశం ఉండని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని అడ్డుకున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే ప్రజలకు సూచనలు చేయవచ్చుకానీ, కేంద్రంలోని స్టేజ్ వద్ద కూర్చోవడానికి వీలు లేదని చెప్పడంతో సైలెంట్ అయిపోయారు. పక్కన ఉండి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకొని అధికారులకు అందించారు.



అధికారులతో ప్రజాపాలన వద్ద వాగ్వివాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

# బస్సుల్లేక చీకట్లోనే విద్యార్థులు

- విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు వేస్తే బాగుంటుంది
- ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన ప్రియదర్శిని



పోచంపల్లి వద్ద రోడ్డుపై చీకట్లోనే విద్యార్థులు, వారితో పాటు ఉపాధ్యాయురాలు

మానకొండూర్ రూరల్, జనవరి 3: మహాలక్ష్మి పథకం కింద మహిళలకు బస్సు ఫ్రీ వారికి ఎంతో సంతోషాన్నిస్తుండగా, విద్యార్థులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నది. ఉదయం ఎలాగోలా కష్టపడి కాలేజీలు, పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు, సాయంత్రం బస్సులు ఖాళీగా రాక తిరిగి ఇళ్లకు చేరలేకపోతున్నారు. బుధవారం మానకొండూర్ మండలం పోచంపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమీప గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి అభ్యసించే విద్యార్థులు దాదాపు 87 మంది పాఠశాల విడిచిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు 4 గంటలకు పోచంపల్లిలో రోడ్డుపైకి వచ్చారు. అయితే బస్సులు రాకపోవడం, వచ్చినా సీట్లు దొరక్కపోవడం, కనీసం నిల్చుని వెళ్లే జాగ కూడా లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉన్నారు. ఒకరిద్దరు అతికష్టం మీద వెళ్లిపోయినా మిగతా విద్యార్థులతోపాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు రాత్రి 8 గంటల దాకా పడిగాపులు పడ్డారు. దగ్గరుండి బస్సులను ఆపించి పిల్లలను పంపించాల్సిన పరిస్థితి వచ్చింది. కాగా, పిల్లల కోసం ప్రత్యేక బస్సులు వేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన ప్రియదర్శిని కోరారు.